### వేముల రామమూర్తి కృషితో గాంధీపురంలో నిలిచిన

# మణుగూరు ఎక్స్‌ప్రెస్

## ఘనస్వాగతం పలికిన గ్రామపెద్దలు, స్థానికులు




**కారేపల్లి, కెరటం న్యూస్ ప్రతినిధి**

మండలపరిధిలోని గాదపాడుకు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త వేముల రామమూర్తి కృషితో బెలగావి నుండి మణుగూరు వెళ్లే ఎక్స్ప్రెస్ రైలు మండల పరిధిలోని గాంధీపురం రైల్వే స్టేషన్ వద్ద బుధవారం నిలిచింది. ఈ సందర్భంగా వేముల రామమూర్తి తో పాటు పలువురు గ్రామ పెద్దలు రైల్వే డ్రైవర్ కు పుష్పగుచ్ఛం అందించి, స్వీట్స్ తినిపించి, స్వాగతం పలికారు. కరోనాకు ముందు నడిచిన ఈ రైలు కరోనా సమయంలో నిలిపివేయడంతో ఈ ప్రాంత రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ రైలు నిలిచిన సమయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణముతో సహా చుట్టుపక్కల 20 గ్రామాలకు వరంగల్, హైదరాబాద్, కొత్తగూడెం, మణుగూరు వెళ్లడానికి సౌకర్యంగా ఉండేది. ప్రయాణికుల కష్టాలను గమనించిన వేముల రామమూర్తి పట్టు వదలని విక్రమార్కుడిలా రైల్వే శాఖ అధికారుల చుట్టూ తిరిగి ఎట్టకేలకు ఈ రైలును పునః ప్రారంభింపజేశారు. సోమవారం నుండి రైలు అయితే ప్రారంభమైంది గాని ఇది మండల పరిధిలోని కారేపల్లి లో గాని, గాంధీ పురం లో గాని హాల్ట్ ఇవ్వకపోవడంతో రైల్వే ప్రయాణికులకు నిరాశే మిగిలింది. దీంతో వేముల రామమూర్తి మళ్లీ రైల్వే అధికారులను కలిసి గాంధీ పురం లో ఈ ఎక్స్ప్రెస్ రైలు ఆపాలని రైల్వే శాఖ అధికారులకు విన్నవించారు. ఆయన విన్నపాన్ని మన్నించి, స్పందించిన రైల్వే శాఖ అధికారులు బుధవారం నుండి గాంధీ పురం లో ఈ రైలుకు హాల్టింగ్ ఇవ్వడానికి సమ్మతించారు. దాంతో బుధవారం ఈ రైలు గాంధీపురం స్టేషన్లో ఆగింది. దీంతో ఈ ప్రాంత ప్రజలు సామాజిక కార్యకర్త వేముల రామమూర్తికి పుష్పగుచ్ఛం అందించి ,స్వీట్స్ తినిపించి అభినందించారు. ఈ కార్యక్రమం లో కర్నాటి భాస్కర్, కేసగాని ఉపేందర్, కాటేపల్లి కోటేశ్వరరావు, సింగ్ లెనిన్, ఆశా కార్యకర్త సావిత్రి తో పాటు గాదెపాడు, మాణిక్యారం గ్రామాలకు చెందిన పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# పెండ్లి కుమార్తెను ఆశీర్వదించిన మట్టా దయానంద్

**పెనుబల్లి, కెరటం న్యూస్**

పెనుబల్లి మండలం బయ్యన్నగూడెం గ్రామానికి చెందిన జీడిమెట్ల వెంకట సత్యనారాయణ (లేటు)- చెన్నమ్మ కుమార్తె భవాని ప్రతానం వేడుకలో కాబొయ్యే వధువును ఆశీర్వదించిన, ఖమ్మం జిల్లా నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్.. ఈ కార్యక్రమంలో మాధవ్, కావాటి శ్రీను,దొడ్డా శ్రీనివాసరావు, ఇమ్మనేని ప్రసాదరావు,సాయి శ్రీనివాస్, ఈలప్రోలు నారాయణ మరియు తదితరులు పాల్గొన్నారు.

